



అంతిమయాత్రలో పాల్గొన్న ఎంఏ.గఫూర్, నాయకులు

దినదినగండమే..!

- పని దొరికితే సంతోషం.. లేకపోతే అంతే..!
- రోజూ వెయ్యి మంది దాకా కూలీ పనుల కోసం కర్ణాటకకు

కోసిగి మండలం అంటేనే నిరక్షరాస్యతకు మారుపేరు. తెల్లారితే బతుకు వేట మొదలవుతుంది. కోసిగి మండలంలోని పల్లెల్లో ఉంటున్న కూలీలు, పట్టణాలకు రోజూ పొట్టకూటి కోసం పనుల వేటను కొనసాగిస్తున్నారు. పని దొరికిన వారు సంతోషంగా వెళతారు. దొరకని వారు ఉసూరుమంటూ వెనుదిరుగుతారు. స్థానికంగా పనుల్లేక దినదినగండంగా బతుకులు సాగిస్తున్నారు. రోజూ కోసిగి మండలం నుంచి దాదాపు వెయ్యి మంది కర్ణాటకకు కూలీ పనుల కోసం వెళుతున్నారు. ఇదీ కోసిగి మండల ప్రజల ధీనస్థితి...



ప్లాట్ ఫారంపై నిలుచున్న మహిళలు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలో 24 గ్రామాలు.. రెండు మజరా గ్రామాలున్నాయి. స్థానికంగా పనులు లేకపోవడంతో పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు రోజూ దాదాపు 1000 మంది మహిళలు, వృద్ధులు, యువకులు పనుల కోసం వెళుతుంటారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌లో పారిశుధ్య కార్మికులుగా, భవన నిర్మాణ కార్మికులుగా, పొలాల్లో కలుపు తీయడానికి, వివిధ రంగాల్లో పనులు చేసుకుని కడుపు నింపుకుంటున్నారు. చాలామంది రైతులు సైతం కూలీలుగా మారుతున్నారు. మరికొంతమంది ముంబయి, హైదరాబాదు, గుంటూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు పిల్లాపాపలతో కలిసి వలస వెళుతున్నారు. ఉదయాన్నే కోసిగి రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణం చేస్తారు. రోజూ రూ.500 నుంచి రూ.800ల వరకు కూలి వస్తుంది. పని చేసిన వెంటనే డబ్బులు చేతికి ఇవ్వడంతో కూలీలు సంతృప్తి చెందుతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి స్థానికంగా చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని గ్రామస్తులు కోరుతున్నారు.



రైలు కోసం వేచి చూస్తున్న కూలీలు

స్థానికంగా పనుల్లేవు

- వీరేష్, కూలీ, కోసిగి గ్రామం



నేను దాదాపు 8 సంవత్సరాల నుంచి రాయచూరుకు రోజూ కూలీ పనుల కోసం వెళ్తున్నాను. స్థానికంగా పనుల్లేవు. ఇక్కడ పని చేసినా కూలీకి తగ్గ గిట్టుబాటు ధర ఇవ్వరు. అందుకని రోజూ కర్ణాటక రాష్ట్రానికి వెళ్తాను. రూ.500 నుంచి రూ.800 వరకు సంపాదిస్తాను. నా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను.

చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- కృష్ణ, కూలీ, సజ్జలగూడెం గ్రామం



మండలంలో పనుల్లేవు. ఉపాధి అవకాశాలు లేకపోవడంతో రాయచూరుకు రోజూ వెళ్తాను. దాదాపు చుట్టుపక్కల గ్రామాల నుంచి 1000 మంది వరకు కూలీలు వస్తుంటారు. పెద్ద, పెద్ద రైతులు సైతం కూలీ కోసం వస్తారు. పొట్టకూటి కోసం అన్ని రకాల పనులు చేస్తాం. రోజూ పని ఉండదు. దొరికిన రోజు సంతోషం. ఉదయాన్నే రైలులో ప్రయాణించి, రాత్రి తిరిగి రైలుకు వస్తాం.


సిపిఎం సీనియర్ నాయకుడు

జెఎన్.శేషయ్య హఠాన్మరణం

- అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ జిల్లా కమిటీ సభ్యులు జెఎన్ శేషయ్య(72) సోమవారం రాత్రి 10:45 గంటలకు గుండెపోటుతో మరణించారు. ఆయన కల్లూరు ఎస్టేట్‌లోని సాగర్‌గార్మెంట్స్‌లో టైలర్‌గా పని చేస్తూ అక్కడ సిఐటియును ఏర్పాటు చేశారు. ఆక్రమంలో కల్లూరు కాలనీల్లో ఆయనకు ఏర్పడిన సంబంధాలతలో ఉపసర్పంచిగా ఎన్నికయ్యారు. కల్లూరు అభివృద్ధికి కృషి చేశారు. సిపిఎం వివిధ సంఘాలలో చురుకైన పాత్ర పోషించి తుది శ్వాసవరకు పనిచేశారు. ఆయన సీడ్ రైతుల కోఆర్డినేటర్‌గా, రైతు సంఘం నాయకుడిగా, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా, వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్‌గా, పార్టీ జిల్లా కమిటీ సభ్యునిగా పనిచేశారు. ప్రస్తుతం సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్‌గా పనిచేస్తూ, బాలోత్సవం-2025ను విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఆయనకు భార్య పుష్పావతి కుమారులు రవికుమార్, కిషోర్, కూతురు కృష్ణవేణి ఉన్నారు. ఆయన మృతి సిపిఎం ప్రజాంఘాలకు తీరని లోటని పలువురు నాయకులు తెలిపారు. ఆయన పార్థివ దేహానికి సిపిఎం కేంద్రకమిటీ మాజీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్, మాజీ ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్, కర్నూలు , నంద్యాల సిపిఎం జిల్లా కార్యదర్శులు డి.గౌస్‌దేశాయ్, టి.రమేష్‌కుమార్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, విద్యాసంస్థల ప్రతినిధులు, నగర ప్రముఖులు ఆయన పార్థివ దేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన భౌతిక కాయంపై ఎంఏ. గఫూర్ సిపిఎం జెండాను కప్పి షెల్యూట్ చేశారు. మంగళవారం కృష్ణానగర్ ఐటిసి ఏరియా (ఇంపీరియల్ టుబాకో కంపెనీ) ఆయన నివాసం నుంచి కల్లూరు స్మశాన వాటిక వరకు అశృనయనాల మధ్య అంతిమయాత్ర జరిగింది. అక్కడ యానను ఖననం చేశారు. ఆయన పెద్దకుమారుడు రవికుమార్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, రవీంద్ర విద్యా సంస్థల అధినేత పుల్లయ్య, ఆయన తమ్ముడు చిన్న సుబ్బయ్య, పిబివి సుబ్బయ్య, టిజివి లలిత కళాసమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య, నక్కల మిట్ట శ్రీనివాసులు, డాక్టర్ బ్రహ్మారెడ్డి, ప్రతిభ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ అరుణాచల రెడ్డి, కార్పొరేటర్లు నరసింహులు, సుదర్శన్ రెడ్డి, డాక్టర్ శంకర్ శర్మ, భరత హాస్పిటల్ కంటి వైద్యురాలు డాక్టర్ స్వాతి, డాక్టర్ మాధవస్వామి, పోలిశెట్టి రమణయ్య, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు గడిగే ప్రసాద్, ప్రైవేటు విద్యాసంస్థల జిల్లా కార్యదర్శి వాసు దేవయ్య, హిస్టరీ అధ్యాపకులు బడేసాహెబ్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, నంద్యాల జిల్లా నాయకులు శ్రీనివాసమూర్తి, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, కర్నూలు జిల్లా సభ్యులు ఆయన పార్థివ దేహంపై పార్టీ జెండాను కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురుశేఖర్, మంగళవారం సాయంత్రం జరిగిన ఆయన అంతిమయాత్రలో జెఎస్.శేషయ్య ఆశయాలను కొనసాగిస్తాం, జోహార్ జెఎన్.శేషయ్య, అంటూ నినాదాలు చేశారు. మెప్మా ఆర్పిల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రుద్రమ్మ, ఎస్.ఉమాదేవి, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు జె.దివాకర్, సిపిఎం సీనియర్ నాయకులు రామాంజనేయులు, న్యూసిటీ ఓల్డ్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు టి.రాముడు, ఎం.రాజశేఖర్ సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, పిఎస్ రాధాకష్ణ, ఎండి అంజిబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు,సాహితీ స్రవంతి నాయకులు జంధ్యాల.రఘుబాబు, ఐలు నాయకులు కుమార్, లక్ష్మన్న, జెవివి నాయకులు బిడి. సుధీర్, యుటిఎఫ్ నాయకులు సురేష్, రవి, డివైఎఫ్ఐ ,ఎస్ఎఫ్ఐ, రజక వృత్తిదారుల సంఘం, ఆవాజ్, చిన్న వ్యాపారస్తుల సంఘం, ఎపిపిఎస్ నాయకులు, ఐటిసి హమాలీలు, ఉభయ జిల్లాల సిపిఎం నాయకులు, ఆయన సహచరులు బసవయ్య, బంధుమిత్రులు నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న పుల్లయ్య

శేషయ్య మృతి దిగ్భ్రాంతికి గురి చేసింది

- తెలకపల్లి రవి

సిపిఎం సీనియర్ నాయకులు జెఎన్.శేషయ్య ఆకస్మిక మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి ఒక ప్రకటనలో తెలిపారు. గతవారంలోనే ఆయనతో కలిసి మాట్లాడానని, దీర్ఘకాలంగా ఉద్యమంలో పని చేయడమేగాక ప్రత్యేకంగా నాన్న నరసింహయ్యకు చేదోడుగా, మా కుటుంబంతో ఎంతో సన్నిహితంగా మెలిగిన మిత్రులు అని పేర్కొన్నారు. ఆయన మతికి ప్రగాఢ సంతాపం వెల్లడిస్తూ ఆయన కుటుంబానికి మా మనఃపూర్వక సానుభూతిని తెలిపారు.



నివాళులర్పిస్తున్న గౌస్‌దేశాయ్, నాయకులు

రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు

- ప్రయివేటు ఆస్పత్రులతో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని, రోగుల నుండి డబ్బు వసూలు చేస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆసుపత్రి యాజమాన్యాలను హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్‌టిఆర్ వైద్య సేవకు సంబంధించి ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ వైద్యసేవ కింద రోగులకు ఉచితంగా వైద్యం అందించే పథకమని, రోగుల నుండి డబ్బు తీసుకోవడం సముచితం కాదని కలెక్టర్ తెలిపారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద రోగులకు మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని, కమర్షియల్ పద్ధతిలో ఆలోచన చేయకూడదని కలెక్టర్ ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలను ఆదేశించారు. ఆసుపత్రికి ఎవరైనా రోగులు వచ్చినప్పుడు వారు ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ కార్డు మర్చిపోయిన ఎడల వారిని ముందుగా ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఎన్రోల్ చేసి ఉచితంగా ఒపి పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ప్రయివేట్ నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలను ఆదేశించారు. ఆసుపత్రి యాజమాన్యాలు రోగుల నుండి డబ్బు తీసుకుంటున్నట్లు ఐవిఆర్ఎస్ ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయ సేకరణలో తేలిందన్నారు. నగరంలోని అమీలియో, ఏం ఎస్ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, స్టార్ కేర్, ఒమేగా ఆసుపత్రులలో ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద రోగుల నుండి డబ్బులు తీసుకుంటున్నట్లు ప్రజల నుండి ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజల నుండి ఫిర్యాదులు రాకుండా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఆసుపత్రుల యాజమాన్యాలకు సూచించారు. ఎంఎస్ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వారు సమావేశానికి హాజరు కానందున నోటీస్ ఇవ్వాలని కలెక్టర్ ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ ను ఆదేశించారు.. ఆసుపత్రులకు ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వం నుండి పెండింగ్ లో ఉన్న బకాయిలకు సంబంధించి డిఒ లెటర్ సిద్ధం చేయాలని కలెక్టర్ ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్‌ను ఆదేశించారు.. సమావేశంలో ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంవిఎన్ ఎస్‌వి.భాస్కర్ రెడ్డి, ఇంచార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ లలిత దేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా , ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు పాల్గొన్నారు.



ప్రయివేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యం సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఉల్లి కొనుగోళ్లకు రూ. 10 కోట్లు విడుదల

ఉల్లి పంట కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. మంగళవారం ఉల్లి కొనుగోళ్ల అంశానికి సంబంధించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కొనుగోళ్ల కమిటీ సమావేశాన్ని టెలి కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లి కొనుగోళ్ల ప్రక్రియను ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.. రైతుల నుండి ఆధార్, బ్యాంకు అకౌంట్ తదితర వివరాలను తీసుకుని, ఎక్కడా పొరపాట్లు లేకుండా ఉల్లి కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఈనెల 20లోకా ఎర్లీ ఖరీఫ్ పంట వచ్చే అవకాశం ఉందని హార్టికల్చర్ అధికారులు కలెక్టర్ కు వివరించారు. ప్రతి రోజు 500 మెట్రిక్ టన్నుల ఉల్లిని ఇతర ప్రాంతాల మార్కెట్లకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నంద్యాల, కడప జిల్లాల హోల్ సేల్ మార్కెట్లకు తరలించేందుకు వీలుగా ఆయా జిల్లాల కలెక్టర్లతో మాట్లాడతానని కలెక్టర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ ఈ రోజు 200 టన్నులు తాడేపల్లిగూడెంకు, 200 టన్నులు హైదరాబాదుకు, రైతు బజార్‌కు 80 టన్నులు పంపుతున్నామని వివరించారు. మార్కెటింగ్ శాఖ జెడి రామాంజనేయులు, మార్కెటింగ్ ఏడి నారాయణ మూర్తి, మార్క్ ఫెడ్ డిఎం రాజు, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, మార్కెట్ యార్డ్ సెక్రెటరీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.అలివేలు, హాజరయిన మహిళలు

స్త్రీ శక్తికి పట్టం కట్టండి : ఐద్వా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఏ దేశంలో స్త్రీ శక్తికి ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, రంగాలలో సమాన అవకాశాలు కల్పించబడ్డాయో, ఆదేశాలు వేగంగా అభివృద్ధి చెందు తున్నాయని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు పేర్కొన్నారు. మంగళవారం శరీన్ నగర్లోని 31, 32 వార్డుల ఐద్వా సభ్యుల సమావేశం, మహిళా సంఘం నగరనాయకులు ఎం.ఉమా అధ్యక్షతన, నాగుల కట్ట వద్ద నిర్వహించారు. ఎన్. అలివేలు, ప్రసంగిస్తూ 77 ఏళ్ల స్వాతంత్ర కాలంలో కేంద్రంలో, రాష్ట్రాల్లో ,ఎన్ని ప్రభుత్వాలు, మారుతున్నా, మహిళల జీవితాలలో గణనీయమైన మార్పులు రాలేదన్నారు. నేటికి సమాజంలో మహిళలకు భద్రత లేదన్నారు. అత్యాచారాలు, అసమానతలు, పెరిగిపోయాయని ఆవేదన చెందారు. నాలుగేళ్ల , పసికూనల నుండి 60 ఏళ్ల ముదుసలి వరకు. అత్యాచారాలకు గురవుతున్నారంటే, మహిళల పరిస్థితులు ఎంత భయానకంగా ఉందో ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలన్నారు. వారి ప్రగతి కోసం , జాతీయ మహిళా సంఘాల, ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళికలు రచించి, చిత్తశుద్ధితో అమలు చేయాలని ప్రభుత్వాలను, డిమాండ్‌చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్, పథకాలలో, ప్రధానంగా మహిళలకు , ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం. మహిళలు చైతన్యవంతులైతేనే సమాజ పురోగతి సాధ్యపడు తుందని అన్నారు. నివాస ప్రాంతాలలో మహిళలు ఎంత సంఘటిత మైతే అంత రక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జెఎన్ శేషయ్యకు కెపిఆర్ సంతాపం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిపిఎం సీనియర్ నాయకుడు జెఎన్.శేషయ్య ఆకస్మిక మతివారి కుటుంబానికి,పార్టీకి తీరని లోటు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెఎస్.శేషయ్య 1980 నుండి నాలుగు దశాబ్దాలకు పైగా సిపిఎం లో కార్యకర్తగా, నాయకుడిగా విశేష కృషి చేశారన్నారు. కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ సాగర్ గార్మెంట్స్ కార్మిక సంఘం స్థాపనతో ప్రారంభమైన ఉద్యమ జీవితం అనేక సంఘాలకు నాయకుడుగా ఉన్నారు. సిఐటియు, రైతుసంఘం, చేనేత కార్మిక సంఘం, విజ్ఞాన కేంద్రాలు, బలోత్సవాల నిర్వహణ ఇలా ఏ రంగంలో బాధ్యత ఇచ్చినా ఆ రంగంలో కృత నిశ్చయంతో పనిచేశారని తెలిపారు. అందరి ఆధరాభిమానాలు సంపాదించారన్నారు. ఇటీవలనే అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. ఆయన లేని లోట్లు పూడ్చలేనిదని పేర్కారు. ఆయన మరణం పార్టీ ఉద్యమానికి, ప్రజాసంఘాలకు తీరనిలోటు అన్నారు. శేషయ్యమృ ప్రగాఢ సంతాపం, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు.

రైతులను విస్మరించిన కూటమి ప్రభుత్వం

ఆర్‌డిఒ కార్యాలయాల ఎదుట వైసిపి అన్నదాత పోరు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్/పత్తికొండ

రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డౌన్ డౌన్ అంటూ, కర్నూలు, పత్తికొండ, ఆదోని ఆర్‌డిఒ కార్యాలయాల ముందు అన్నదాతపోరు పేరుతో వైసిపి భారీ నిరసన కార్యక్రమం చేపట్టింది.

ముందు వైసిపి నాయకుల నినాదాలతో దద్దరిల్లిపోయింది. ఈ కార్యక్రమానికి రైతులు భారీగా తరలివచ్చారు. కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి నాయకత్వంలో కర్నూలు ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట పెద్దఎత్తు కార్యాక్రమం నిర్వహించారు. పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆధ్వర్యంలో రైతులు ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై నినాదాలు చేస్తూ హోరెత్తించారు.ఆదోనిలో ఎమ్మెల్సీ డాక్టర్‌మధుసూదన్ , మాజీ ఎంపీ బుట్టారేనుక, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నాయకత్వం వహించారు.

పత్తికొండ పట్టణంలో ర్యాలీ చేసేందుకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఆర్‌డిఒ కార్యాలయం వద్దకు రైతులు, పార్టీ నేతలు చేరుకుని ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతన్నలకు గిట్టుబాటు ధర లేక అప్పులు తీర్చే దారి కనిపించక ఆత్మహత్యలు చేసుకుంటే వారిపైనే కేసులు పెట్టడం రాక్షసత్వమని అన్నారు. రైతు సమస్యలు పరిష్కరించలేక పోతే వ్యవసాయ శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రైతులు తమకు గిట్టుబాటు ధర కల్పించాలని అధికారులకు విన్నవించుకునేందుకు వస్తే పోలీసులు డ్రోన్లు ఉపయోగించి కేసులు పెడతామని భయపెడుతున్నారని అన్నారు. ఎవరెన్ని ఆంక్షలు విధించినా కేసులు పెట్టినా రైతుల పక్షాన నిలబడి పోరాడేందుకు జగనన్న ఆధ్వర్యంలో మేము సిద్ధంగా ఉంటామని హెచ్చరించారు. రైతు వ్యతిరేక కూటమి ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నటించిన సినిమాకు టికెట్ ధర పెంచి నిర్మాతలకు లాభం చేకూర్చడం తెలుసుగాని, రాష్ట్రంలోని రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం తెలియదా అని ప్రశ్నించారు.



కర్నూలు ఆర్‌డిఒ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్తున వైసిపి శ్రేణులు, రైతులు



పత్తికొండలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి ,ఎమ్మెల్యే విరుపాక్షి

రైతుల నిరసన ర్యాలీ విజయవంతం

కర్నూలు హాస్పిటల్ : రైతులను దగాచేస్తున్న కూటమి సర్కార్ పై వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కర్నూలు నియోజకవర్గంలో కర్నూలు అసెంబ్లీ ఇంచార్జ్ ఎస్వీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో "ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు రైతన్నకు బాసటగా వైసిపి తరపున రైతుల సమస్యల పరిష్కారానికి రైతులతో కలిసి కర్నూలు లోని చిల్డ్రన్ పార్క్ నుండి పెద్ద ఎత్తున రైతులతో కలిసి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గంగుల ప్రభాకర్ రెడ్డి స్టేట్ మహిళ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌వి విజయ మనోహరి, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్, మేయర్ బివై.రామయ్య అహ్మద్ అలీ ఖాన్ , కర్నూలు నియోజకవర్గ కార్పొరేటర్లు, అనుబంధ విభాగం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొండారెడ్డి బురుజు పార్కుకు తాళం

-రూ.కోటి పైగా మంజూరై మూడేళ్లయినా మూడు మొక్కలు నాటలేదు

-మద్యం ప్రియులకు అడ్డా పాత నగరం లోని మరో పార్కు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : పర్యాటక కేంద్రం అభివృద్ధి పేరుతో కొండారెడ్డి బురుజు సమీపంలో ఉన్న పాత కట్టడాలన్ని కూల్చివేసి రూ.కోటికి పైగా ఖర్చు చేసి నిర్మించిన పార్కులోకి పర్యాటకులు వృద్ధులు వికలాంగులతో పాటు నగర ప్రజలు లోపలికి వెళ్లకుండా తాళం వేశారని సమీప కాలనీల ప్రతినిధులు ఎం.హనుమంత రెడ్డి, జె.నాగభూషణం, ఎంఏ.సర్దార్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద మార్కెట్ సమీపంలోని పార్కు అభివృద్ధికి రూ.కోటికిపైగా మంజూరై మూడేళ్లు గడుస్తున్నా మూడు మొక్కలు నాటలేదని విమర్శించారు. మంగళవారం స్థానికులతో కలిసి పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం పాత నగరంలోని రెండు పార్కులను పరిశీలించింది. వారు మాట్లాడుతూ ప్రజాధనంతో నిర్మించిన పార్కులోకి వృద్ధులకు, ప్రజలకు ప్రవేశం లేదా అని ప్రశ్నించారు. పెద్ద మార్కెట్ సమీపంలో రూ.కోటికి పైగా మంజూరై మూడేళు గడుస్తున్నా మూడు మొక్కలు కూడా నాటలేదని తెలిపారు. చిన్నపిల్లల కోసం ఏర్పాటుచేసిన పరికరాలు నెల తిరగకముందే శిథిలమైనాయని అన్నారు. నగరపాలక సంస్థ ఇంజనీర్ల నిర్లక్ష్యం వల్ల ఈ పార్కు మద్యం ప్రియులకు అడ్డాగా మారిందని తెలిపారు. రెండు లక్షల జనాభా ఉన్న పాత నగరం ప్రజలకు ఈ రెండు పార్కులు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. వెంటనే కమిషనర్ పర్యటించి ప్రజాధనం వృథాపైన, పార్కుల అభివృద్ధి పైన చర్యలు తీసుకొని అన్ని పార్కుల్లో వృద్ధులు వికలాంగులు పిల్లలు స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మహమ్మద్ యూనూస్, టి నాగరాజు, అన్వర్ భాష, జాఫర్ ఖాన్, ఆంజనేయులు గౌడ్, జాకీర్, జయరాజు,గులాబ్ బాష తదితరులు పాల్గొన్నారు.



కొండారెడ్డి బురుజు వద్ద పార్కును పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ నేతలు

ఇల్లు మంజూరు చేయాలి

ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి పెద్దపాడు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



కర్నూలు జిల్లా కల్లూరు మండలం కర్నూలు కార్పొరేషన్ పరిధి 36వ వార్డు పేదలు మంగళవారం ఏమ్మెల్యే నివాసంలో పాణ్యం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.సిపిఎం గ్రామ నాయకులు కె మద్దిలేటి, ఎన్.చిలకమ్మ మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం 2018 సంవత్సరంలో ఇండ్లు లేని వారిని, నిరుపేదలైన వారు బాడుగ ఇండ్లలో ఉన్న వారినీ గుర్తించి ఒక్కొక్కరికి సెంటు భూమి పట్టాలు ఇస్తున్నారన్నారు. పోయిన ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేయలేదని, టిడిపి కూటమి ప్రభుత్వ మయినా మాకు ఇండ్లు మంజూరు చేయాలని ఏమ్మెల్యేను కోరారు. ఏమ్మెల్యే గౌరు చరిత రెడ్డి స్పందించి వెంటనే హౌసింగ్ అధికారులకు ఫోన్ చేసి వారి పట్టాలు చూసి హౌసింగ్ ద్వారా ఇండ్లు మంజూరు ఆదేశించారు. మద్దిలేటి, నారాయణ, మౌలాలి, మహేష్ ,ఎస్తేరమ్మ, సునీత, షమీమ్ శామీర్, ఎల్లిశమ్మ, సుభద్ర, సతెమ్మ, సావిత్రి, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వద్ధురాలి హత్య కేసులో మహిళ అరెస్ట్

-చేధించిన కర్నూలు త్రీ టౌన్ పోలీసులు

-రోకలి బండ, బంగారు ఆభరణాలు, బ్యాంకు పాసుపుస్తకాలు, చెక్ బుక్ లు స్వాధీనం

-ఎస్‌పి విక్రాంత్ పాటిల్ వెల్లడి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వద్ధురాలిని హత్య చేసిన కేసులో నిందితురాలని అరెస్టు చేశామని కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. కేసు వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మీడియాకు వెల్లడించారు.ఎస్‌పి విరాల మేరకు కర్నూలులో సాయి వైభవ్ నగర్ లో ఈనెల 1న కాటసాని శివలీల (75) అతి దారుణంగా హత్యకు గురైన సంగతి తెలిసిందే. డిఎస్‌పి జి బాబు ప్రసాద్ నేతృత్వంలో కర్నూల్ 3 టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా ఇంట్లో పని మనిషి కురువ వరలక్ష్మి (49) హత్య చేసి శివలీల ఒంటి పై ఉన్న బంగారు ఆభరణాలు తీసుకుని వెళ్లింది. మెయిన్ రోడ్డు లో ఉన్న సిసిటివి కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితురాలిని గుర్తించాం. జిల్లాలో 5 వేల సిసి కెమెరాలను ఇటీవల కాలంలో ఏర్పాటు చేశాం. కర్నూలు పట్టణంలోనే 2 వేల సిసి కెమెరాలున్నాయి. నిందితురాలి వేలిముద్రలు ఘటన జరిగిన ప్రాంతంలో గుర్తించాం. శివలీలను రోకలి బండతో తలపై కొట్టి హత్య చేసింది. ముద్దాయి నుంచి 11 తులాల బంగారు ఆభరణాలు , బ్యాంకు పాసు పుస్తకాలు, చెక్‌బుక్‌లు, హత్యకు ఉపయోగించిన రొకలి బండను స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు డిఎస్‌పి జె. బాబు ప్రసాద్, కర్నూలు త్రీ టౌన్ సిఐ శేషయ్య, కర్నూలు రూరల్ సిఐ చంద్రబాబు నాయుడు, పోలీసు సిబ్బంది ఉన్నారు. కేసును త్వరితగతిన చేధించిన పోలీసు అధికారులను సిబ్బందిని ఎస్‌పి అభినందించిన రివార్డులు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాసులు, శేఖర్‌బాబు, ప్రతాప్ కుమార్. కానిస్టేబుల్స్ నాగరాజు, చంద్రబాబునాయుడు, పరమేశ్వరుడు, సమీర్, రాముడు, వీరబాబు, హోంగార్డు ఇబ్రహీంలను అభినందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాసరరెడ్డి

పేదరికం లేని సమాజ నిర్మాణానికి కృషి

- జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి

ప్రజాశక్తి - నందవరం

పేదరికం లేని సమాజ నిర్మాణానికి నాయకులు, ధనికులు, ఉద్యోగులు కృషి చేయాలని జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని కనకవీడు, గురజాల పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దండోరా, కరపత్రాలు, సమావేశాల ద్వారా ఐవిఆర్ఎస్ కాల్స్ గురించి ప్రజలకు తెలపాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, అంబాసీ దర్లకు మొత్తం జీతాలు చెల్లించాలని తెలిపారు. అనంతరం నందవరం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పి4 సర్వేపై ముందుకు రావాలని కోరారు. సంపన్నులు పేదలను ఆదుకొని పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని తెలిపారు. ఎంపిడిఒ పుల్లయ్య, తహశీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపిడిఒ సందీప్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్, మండల కన్వీనర్ ఖాసీంవలీ, సొసైటీ ఛైర్మన్ ధర్మపురం గోపాల్, బీసీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ డైరెక్టర్ చిన్న రాముడు, నాగలదిన్నె జబ్బార్, జనసేన పార్టీ మండల కన్వీనర్ పెద్ద ఎల్లప్ప, నది కైరవాడి వీరేష్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి

- టిడిపి మహిళా రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం జ్యోతి


సన్మానం చేస్తున్న టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి వైకుంఠం జ్యోతి

ప్రజాశక్తి- దేవనకొండ

గ్రామంలో ఉద్యోగాలు సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో చదివి నిరుద్యోగ యువత, విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని టిడిపి మహిళా రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం జ్యోతి తెలిపారు. మండలంలోని పి.కోటకొండ గ్రామంలో 2025 మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన 9 మందికి, ఒక ఎపిఎస్‌పి కానిస్టేబుల్‌ను మంగళవారం టిడిపి నాయకులు మల్లేపల్లి రంగడు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా హాజరైన టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ఉచ్చీరప్ప మాట్లాడారు. పట్టుదలతో కష్టపడి చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. టిడిపి నాయకులు రామారావు నాయుడు, రాజశేఖర్ గౌడ్, లారీ కృష్ణమూర్తి, అక్షిత ఫౌండేషన్ ప్రతినిధి అంజి స్వామి పాల్గొన్నారు. అలాగే యుటిఎఫ్, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి, యుటిఎఫ్ నాయకులు రామకృష్ణ, లక్ష్మన్న, డివైఎఫ్ఐ నాయకులు అనిల్ పాల్గొన్నారు.

ఇసుక దోపిడీని
ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం

- ఎమ్మెల్యే పార్థసారధి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నియోజకవర్గంలో ఇసుక దోపిడీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే పార్థసారధి తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలోని ఇసుక తోలే టిప్పర్ల యజమానులు ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధిని కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రాలయ నియోజకవర్గంలోని ఇసుక రీచుల్లో ఇసుక దోపిడీ ఏ విధంగా జరుగుతుందో, ఎవరి కనుసన్నల్లో జరుగుతుందో ఎమ్మెల్యే పార్థసారధికి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేదలకు ఇల్లు కట్టుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉచితంగా ఇసుక పథకాన్ని తీసుకొస్తే జిల్లాలో అక్రమాలు జరుతున్నాయని, ఇది వరకే జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి వినతి పత్రం ఇచ్చామని చెప్పారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు ఉచిత ఇసుక ఇప్పించడంలో పారదర్శకత తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఇసుక టిప్పర్ల యజమానులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకుంటామని తెలిపారు.


ఇసుక ట్రిప్పర్ల యజమానులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం సిఐటియు మండల 4వ మహాసభ పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్షులు పి.గోవిందు అధ్యక్షత వహించారు. ముందుగా సిఐటియు జెండాను సిఐటియు మండల నాయకులు కె.శైలజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు మాట్లాడారు. నేటికీ ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో కనీస వేతనాలందక కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయని, కొనుగోలు శక్తి తగ్గిందని తెలిపారు. కార్మిక చట్టాలను రద్దు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని, వీటిని కార్మిక పోరాటాలు, సమ్మెల ద్వారా తిప్పికొట్టాలని కోరారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కనీస వేతనాల హక్కు చట్టం, గ్రాట్యుటీ, పింఛను సౌకర్యం, అసంఘటిత రంగ కార్మికులకు, హమాలీ, భవన కార్మికులకు, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశా, మున్సిపల్, భవన, ఆటో కార్మిక సంఘం నాయకులు బి.శివలక్ష్మి, ఎస్.నాగలక్ష్మి, ఎ.సురేష్, కె.ఇస్మాయిల్, డి.ఉస్మాన్‌వలీ, యు.రమేష్, జె.నాగరాజు, బి.కేసన్న, బండా లత, కె.సల్మాన్, నాగ శిరోమణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

సుంకం తగ్గింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పత్తి పంటపై దిగుమతిపై 11 శాతం సుంకం తగ్గింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు కోరారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదోని మార్కెట్ యార్డులో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా హరిబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు మాట్లాడారు. ఇటీవల అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఒత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం పత్తి పంటపై సుంకాన్ని రద్దు చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే పత్తి పంట ధరలు పూర్తిగా పడిపోయాయని, ఇలాంటి పరిస్థితుల్లో అమెరికా నుంచి పత్తి ఉత్పత్తులు దిగుమతి అయితే దేశంలోని పత్తి రైతులు పూర్తిగా నష్టపోతారని తెలిపారు. దిగుమతి సుంకం రద్దు నిర్ణయాన్ని డిసెంబర్ వరకు పొడిగించడం వల్ల ప్రస్తుతం పత్తి ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. పత్తి పంట క్వింటాకు రూ.10 వేలు ఇచ్చి సిసిఐ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నగదు బదిలీ కాకుండా సిసిఐ ద్వారానే పత్తిని కొనుగోలు చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, పి.హనుమంతు, జిల్లా కమిటీ సభ్యులు వీరన్న, అయ్యప్ప, వీరన్న, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు తిక్కన్న, లింగన్న, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి దస్తగిరి బాషా, రైతు సంఘం హోళగుంద మండల అధ్యక్షులు రవి, రైతు సంఘం ఆదోని మండల నాయకులు హనుమంతు రెడ్డి, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న హరిబాబు

బండ్లలోనే చెత్తాచెదారం వేయాలి

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి


మహిళలకు వివరిస్తున్న ఎంపిడిఒ అల్లా బకాష్

తడి, పొడి చెత్తను తప్పనిసరిగా చెత్త బండ్లలోనే వేయాలని ఎంపిడిఒ అల్లా బకాష్ సూచించారు. మంగళవారం చిప్పగిరిలో పంచాయతీ కార్యదర్శి ప్రమీల ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు వీధుల్లోని పరిసరాలను శుభ్రం చేస్తుండగా పరిశీలించారు. చెత్తాచెదారాన్ని చెత్త బండ్లలో వేసే అలవాటు చేసుకోవాలని మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో ప్రతి వీధిలోనూ చెత్తాచెదారం ఎక్కువగా ఉంటుందని, పంచాయతీ కార్మికులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసి చెత్త బండ్లలో తీసుకెళ్లాలని తెలిపారు. చెత్తాచెదారంపై పంచాయతీ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. వీధుల్లో చెత్తాచెదారం, నీరు నిల్వ లేకుంటే దోమలు వ్యాప్తి చెందవని, అంటువ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు.

సిడిపిఒ మానసిక ఒత్తిడితో
అంగన్వాడీ వర్కర్‌కు అస్వస్థత

- సిడిపిఒను సస్పెండ్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు ఐసిడిఎస్ సిడిపిఒ కె.నర్సమ్మ మానసిక ఒత్తిడితో అంగన్వాడీ వర్కర్ భువనేశ్వరి అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలి వివరాల మేరకు... ఈనెల 6న కురవల్లి గ్రామం అంగన్వాడీ కేంద్రం తనిఖీకి వెళ్లిన సిడిపిఒ రేషన్ సరుకులు డీలర్ నుంచి ఎందుకు తెచ్చుకోలేదని అడిగారు. తన మామయ్య మృతి చెందడంతో ఆలస్యమయిందని, తెచ్చుకుంటానని భువనేశ్వరి తెలిపారు. రూ.4 వేలు ఇవ్వమని కోరగా... తన దగ్గర లేవన్నా.. ఫోన్‌పే చూపించమని అన్నారు. సర్వర్ పనిచేయకపోవడంతో సరుకులన్నీ అమ్ముకోవాలను కున్నావా అని తనపై కోపడ్డారని చెప్పారు. సోమవారం కురవల్లి కేంద్రంలో గుడ్లు, సరుకులన్నీ ఎత్తిపెట్టుకున్నారని గ్రూపులో పెట్టారని తెలిపారు. మంగళవారం ఐసిడిఎస్ కార్యాలయంలో సెక్టార్ మీటింగ్‌లో అందరిముందు తనను దుర్భాషలాడుతూ ఎన్ని సరుకులు అమ్ముకుంటున్నావని ఒత్తిడికి గురి చేశారని వాపోయారు.

సిడిపిఒను సస్పెండ్ చేయాలి : మానసిక, పని ఒత్తిడికి గురిచేస్తున్న సిడిపిఒను సస్పెండ్ చేయాలని సిఐటియు నాయకులు పి.హనుమంతు, షాకీర్ కోరారు. చాలీచాలని వేతనాలతో ప్రభుత్వ యాప్‌లు, పని ఒత్తిళ్లతో అంగన్వాడీ సతమతమవుతున్నారని తెలిపారు. మామూళ్ల కోసం మానసికంగా వేధిస్తున్న సిడిపిఒ నర్సమ్మ అంగన్వాడీ వర్కర్ భువనేశ్వరిని తోటి అంగన్వాడీల ముందు దూర్భాషలాడడంతో ఒత్తిడికి గురై పడిపోయారని చెప్పారు. ఆమెను ఆస్పత్రికి తరలించకుండా కుటుంబ సభ్యులు వచ్చే వరకు ఉండడం సరైంది కాదని మండిపడ్డారు. జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి సిడిపిఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.


అంగన్వాడీ వర్కర్‌ను పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

13న దళిత సమ్మేళన సభ

- అంబేద్కర్ భవన సాధన కమిటీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనానికి రూ.2 కోట్లు మంజూరు చేయాలని, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని ఈనెల 13న కుర్ణి కల్యాణ మండపంలో దళితుల ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన సాధన కమిటీ ఛైర్మన్ కదిరికోట ఆదెన్న, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్ చైతన్య మాదిగ కోరారు. మంగళవారం స్థానిక ఎస్సీ కాలనీలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం నెంబర్ 153/2012 ఆమోదం మేరకు బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పార్టీలకతీతంగా జరిగే 'దళితుల ఆత్మీయ సమ్మేళన సభ'కు మాల, మాదిగ, బేడ, బుడగ జంగాలు, ఎరుకల సామాజిక వర్గాలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. దళిత రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, ఉపాధ్యాయులు ఆరెకంటి భాస్కర్, ఎపి వృత్తి చర్మకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుమాల ఆంథోని, దళిత జాగృతి అధ్యక్షులు రోజా ఆర్ట్స్ ఉసేని, కూలూరు ఇసాక్, వెంకటాపురం గుంటెప్ప, జగతాప్ జై పాల్, కదిరికోట ప్రభుదాసు, మడ్డి ప్రతాప్ పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

రైతు సమస్యలు పరిష్కరించాలి

- వైసిపి 'అన్నదాత పోరు'

ప్రజాశక్తి - ఆదోని

రైతుల సమస్యలను పరిష్కరించాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వైసిపి ఆధ్వర్యంలో ఆదోనిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదోని నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి, ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలాది మంది కార్యకర్తలు, రైతులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భీమాస్ సర్కిల్ మీదుగా ప్రదర్శన చేపట్టారు. భీమాస్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన టూ టౌన్, రైల్వే స్టేషన్ రోడ్డు గూండా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు చేరింది. అనంతరం నాయకులు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా వంచిస్తోందని విమర్శించారు. ఎరువుల కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని తెలిపారు. అధిక వర్షాల వల్ల రైతులు నష్టపోయినా గిట్టుబాటు ధర ఇవ్వకుండా ప్రభుత్వం రైతుల సమస్యలను విస్మరించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పట్ల ఎప్పుడూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని, గతంలో వ్యవసాయాన్ని దండగ అన్న ఆయనకు రైతులపై ప్రేమ ఉండదని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో జగన్‌మోహన్ రెడ్డి రైతులకు అండగా నిలిచారని, తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు అండగా ఉంటారని చెప్పారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, నరసింహులు, కిషోర్ పాల్గొన్నారు.


ప్రదర్శన నిర్వహిస్తున్న వైసిపి శ్రేణులు

మహారాజ శ్రీ కర్నూలు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S. No. 623/2024

పి.పుణ్యవతి. ...వాది

ఎదిరి

కె.బాల సుబ్బా రెడ్డి. ...ప్రతివాది

దావా సమన్లు

కె.బాల సుబ్బా రెడ్డి, S/o. కె.వెంకట సుబ్బా రెడ్డి. వయసు 59 సంవత్సరములు, ఇంటి నెంబర్: Plot No.30, E-16-Apartment, Mamatha Nagar, కర్నూల్ సిటి & జిల్లా అను మీపై పై నంబర్ గల దావా ద్వారా ప్రామిసరి నోట్ తేదీ 17.06.2021 ద్వారా మీరు బాకీ పడిన సొమ్మును రాబట్టుకొనుటకు వాది మీపై దావా దాఖలు చేసినారు. కావునా పై కేసు నందు ప్రతివాది అయిన మీరు తేదీ 26.09.2025 న ఉదయం 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకోగలరు. లేనియెడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

శ్రీ బి. మోహన కృష్ణ,
వాది తరపు న్యాయవాది, కర్నూలు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జడ్జి (సీనియర్ డివిజన్)వారి కోర్టులో నంద్యాల

EA NO. 414/2014 IN E P NO. 77/2015 IN O.S. NO.593/2014

P.సుదర్శన్ రెడ్డి. ....పిటిషనర్/DHr

V/S

G.R.ఉస్సేని @ రెడ్డి ఉస్సేని, హెడ్‌కానిస్టేబుల్
S/O. కాశీం సాహెబ్ c/o మద్దికేర పోలీసు స్టేషన్,
మద్దికేర మండలం, కర్నూలు జిల్లా....రెస్పాండెంట్/JDr

నోటీసు టూ రెస్పాండట్ / జె.డి.ఆర్

పిటిషనర్/DHr, రెస్పాండంట్/జె.డి.ఆర్ తాలుకు జీతము జప్తు కోరి పై అమలు అర్జీ దాఖలు చేయగా జీతం జప్తు వారంట్ లో O.SNO: 593/2014 కు బదులుగా O.S NO:593/2015 గా నమోదు కాబడి జీతం OS.No.593/2015 నెంబరుగా CCD డిపాజిట్ అయినందున ఆ మొత్తంయును O.S.NO.593/2015 నుండి O.S.NO.593/2014 నెంబరు కు SEND చేయమని ఫిటీషన్ దాఖలు చేసినందుకు కోర్టు వారు 19-09-2025 తేదిన ఉదయం 10.30 గం. వాయిదా చేసినారు. కావున నీకు ఆపిటిషన్ పై అభ్యంతరములు వున్న యెడల పై కోర్టు యందు హాజరై నీ అభ్యంతములు తెలుపుకొనవలెను లేనిపక్షంలో నీ అంతట పరోక్షంగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా తేదీ : 19-09-2025

ఇట్లు
T. **లక్ష్మి వసంతం రెడ్డి.**
DHr అడ్వకేట్,
నంద్యాల
సెల్ నెం. 9493134081

BEFORE THE HONOURABLE MOTOR VEHICLES ACCIDENT CLAIMS TRIBUNAL NARASARAOPET (IN THE COURT OF THE HONOURABLE XIIITH ADDL. DISTRICT JUDGE, NARASARAO PET)
MVOP NO. 151/2022

Between:
గల్ల @ గెల్ల చారమ్మ @ శారమ్మ ....పిటిషనర్.
Vs
01. యరతోట శివ రామయ్యా
02. ది. ఒరియంటల్ ఇన్సూరెన్స్ కో.లిమిట్
3. ఎం.మల్లిఖార్జున రావు..
... రెస్పాండెంట్లు 1,2,3.

రెస్పాడెంట్ నం.1.. యరతోట శివరామయ్య తండ్రి : నాగయ్య ప్లాట్ నెంబర్ 404, TJ అపార్టుమెంట్, ఆర్.ఎస్. రోడ్డు, కర్నూలు,కర్నూలు జిల్లా,518001..

పై నెంబరు కేసు నందు మీరు మొదటి రెస్పాండెంట్ అయివున్నారు. పై కోర్టువారి నుండి మీకు అనేక పర్యాయములు నోటీసులు జారీ చేసినను ఉద్దేశ్య పూర్వకంగా మీరు నోటీసులు తీసుకోనందున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియ జేయునది. ఏమనగా మీ యొక్క నోటీసు నిమిత్తం ది. 26-9-2025 వ తేదీ నాడు వాయిదా అయివున్నది. కావున వాయిదా రోజు ఉదయం 10-30 గం.లకు మీరు ప్రత్యక్షంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొని గలరు. లేనియెడల పై కేసును మీ పరోక్షమున తీర్మానించ బడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది: 26-9-2025

ఇట్లు
కమ్మకల్లు సంగమేశ్వరరావు,
పిటీషనర్ తరపు న్యాయవాది,
మున్సిపల్ కార్యాలయం ఉత్తరం వైపు,
ఎన్.ఆర్.టి. సెంటర్, చిలకలూరిపేట,
సెల్..9912281014.

మాచనూరు బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి మండలం మాచనూరు గ్రామానికి బిటి రోడ్డు నిర్మాణం చేపట్టి బ్రిడ్జి కూడా నిర్మించాలని సిపిఎం నాయకులు కోరారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. కృష్ణ అధ్యక్షత వహించారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు మైనా మాట్లాడుతూ... పార్టీలు, పాలకులు మారుతున్నా మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని తెలిపారు. మండలంలో మాచనూరు, సిద్ధాపురం, కొక్కరచేడు గ్రామాల్లో రోడ్ల పరిస్థితి పూర్తిగా అధ్వానంగా ఉందని చెప్పారు. ప్రజలు తమ అవసరాల కోసం మండల కేంద్రానికి రావాలంటే భయపడే పరిస్థితి ఉందని, ఇప్పటికే ఆయా గ్రామాల్లో ప్రజలు కిందపడి చాలామంది మృతి చెందారని తెలిపారు. చాలామందికి గాయాలయ్యాయని చెప్పారు. రోజూ విద్యార్థులు పాఠశాలకు రావాలంటే భయపడి చదువులు మానేసే పరిస్థితి దాపురించిందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధిపై నిర్లక్ష్యం చేయడంతో ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని, కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు రాష్ట్రంలో రోడ్లను బాగు చేస్తామని హామీఇచ్చారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో హాలహర్వి, ఆలూరు, ఆస్పరి, హోళగుంద మండలాల్లోని అనేక గ్రామాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. అధ్వానంగా ఉన్న రోడ్ల అభివృద్ధి కోసం నిధులు కేటాయించి పాడైన రోడ్లను, బ్రిడ్జిలను నిర్మించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే మండలంలోని ప్రజలను సమీకరించి సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపిడిఒ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్ఐ మండల నాయకులు విఠల్, సిపిఎం గ్రామ నాయకులు ధనుంజయ, మాచనూరు గ్రామ పెద్దలు బసప్ప, నాగరాజు, రాజు, వీరాంజనేయులు, రామాంజనేయులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


బస్సును అడ్డుకున్న విద్యార్థులు, నాయకులు

సమయానికి బస్సు నడపాలి

- ఆర్‌టిసి బస్సును అడ్డుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి - హోళగుంద

సులువాయి గ్రాము సమయానికి బస్సు నడపాలని విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు, గ్రామ వాసులు బస్సును అడ్డుకున్నారు. ఈ సందర్భగా సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. సులువాయి, పెద్దహ్యేట, మూగమనగుంది, సమతగేరి నుంచి దాదాపు 100 మంది విద్యార్థులు హోళగుందకు వస్తారని తెలిపారు. పాఠశాల, కళాశాల సమయానికి అనుకూలంగా బస్సులు నడపాలని కోరారు. విద్యార్థులు పాఠశాల, కళాశాలకు వెళ్తున్నా బస్సుల ఆలస్యంతో ఆబ్సెంట్ పడుతోందని చెప్పారు. విద్యార్థులు మాట్లాడుతూ... హాజరు తక్కువ ఉందని హాల్ టికెట్లు ఇవ్వక పరీక్షలు కూడా రాయనివ్వరని వాపోయారు. సాయంత్రం ఇంటికి వెళ్లే సరికి రాత్రి 7 గంటలవుతోందని తెలిపారు. సమయానికి బస్సు నడపాలని కోరారు.

ఫుడ్ కమిషన్ సభ్యుల పర్యటన

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమల దేవి మంగళవారం పర్యటించారు. కరివేముల గ్రామంలో రేషన్ దుకాణాన్ని పరిశీలించి రేషన్ నిల్వ, సరుకుల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. దేవనకొండలోని ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సమీపంలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. పర్యాటక అధికారి విజయ, తహశీల్దార్ రామాంజనేయులు, ఆర్ఐ విజయ భాస్కర్ పాల్గొన్నారు.

మహేందర్ రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - కౌతాళం

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా కామవరం మహేంద్రరెడ్డిని నియమించడంతో వైసిపి నాయకులు సన్మానించారు. మంగళవారం కౌతాళం సర్పంచి పాల్ దినకర్, ఉప సర్పంచి చక్రి తిక్కయ్య, మాజీ సర్పంచి అవతారం, వడ్డే రాము, అబ్దుల్ సమద్, వడ్డే చిన్న హుస్సేని, పొదలకుంట ఎంపిటిసి మూకన్న, మదిరే సర్పంచి మల్లయ్య, నాయకులు వడ్డే అంజి, ఎన్‌టిఆర్ నగర్ బాష, అగసలదిన్నె శ్రీకాంత్ గౌడ్, ఖాదర్‌లింగ శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసిపి మండల సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డిని వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.


మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ముంపు పొలాల పరిశీలన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణ శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారిలో వర్షపు ముంపు పొలాలను ఎమ్మెల్యే పార్థసారథి మంగళవారం పరిశీలించారు. ఆ ప్రాంతంలో వైసిపికి చెందిన ఓ నాయకుడు రెండెకరాల భూమిని కొని వర్షపు నీరు పోయేందుకు ఉండే వంకను మట్టి దిబ్బతో పూడ్చివేశారని రైతులు ఎమ్మెల్యేకు వివరించారు. గతంలో వర్షపు నీరు వంకలో నుంచి బయటికి వెళ్లిపోయేవని, ఇప్పుడు నీరు మొత్తం పొలాలను ముంచెత్తుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల తాము పంటలు పండించుకోలేకపోతున్నామని, ఐదేళ్లుగా పొలాలన్నీ నీళ్లలో మునిగాయని పేర్కొన్నారు. దాదాపు 50 మంది రైతులకు సంబంధించిన 100 ఎకరాల భూమి నాశనమవుతోందని తెలిపారు. అధికారులతో మాట్లాడి న్యాయం చేయిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

స్వయం ఉపాధితో అభివృద్ధి

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి- దేవనకొండ

మహిళలు స్వశక్తితో ఎదిగి స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలని మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, టిడిపి సీనియర్ నాయకులు ఉచ్చీరప్ప తెలిపారు. మంగళవారం మండలంలోని నెల్లిబండ గ్రామంలో అక్షిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో 70 మంది మహిళలకు 50 శాతం సబ్సిడీతో కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలు వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. అక్షిత సంస్థ ప్రతినిధులు అంజి స్వామి, మహేష్, టిడిపి నాయకులు రామారావు నాయుడు, రాజశేఖర్ గౌడ్, కోటకొండ రంగడు, మల్లికార్జున గౌడ్, రాజగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా పెద్ద ఎల్లప్ప పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నందవరం

జనసేన పార్టీ మండల అధ్యక్షులు పెద్ద ఎల్లప్ప పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం సొసైటీ కార్యాలయంలో టిడిపి నాయకులు ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నియమాలను పాటిస్తూ తమలో ఒక్కడిగా స్నేహభావంతో ఉన్నారని టిడిపి నాయకులు తెలిపారు. సొసైటీ ఛైర్మన్ గోపాల్, టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ, చిన్నరాముడు, నాగలదిన్నె ఎన్ఎ.జబ్బార్, శేషాద్రి తిమ్మప్ప, కైరవాడి వీరేష్, ఆదిశేషు, గౌస్ పాల్గొన్నారు. ఎమ్మిగనూరు, నందవరం జనసేన పార్టీ కార్యాలయాల్లో పెద్ద ఎల్లప్ప పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. చంద్రబాబు నాయుడు, రాజు, అంజి, ఇర్ఫాన్, హరికృష్ణ, రమేష్, పవన్, ప్రభాకర్, ధను పాల్గొన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

సర్పంచి ఉన్నా.. లేనట్టే..!

- పుట్టకలమర్రిలో అపరిశుభ్రత
- పట్టించుకోని అధికారులు : సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని పుట్టకలమర్రి గ్రామంలో డ్రెయినేజీ కాలువలు లేక అపరిశుభ్రత నెలకొందని, సర్పంచి, అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడం ఏమిటని సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ మండిపడ్డారు. మంగళవారం సిపిఎం నాయకులు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో ఎక్కడ చూసినా మురుగునీరు రోడ్లపై చేరి దుర్వాసన వెదజల్లుతోందని పేర్కొన్నారు. కాలువలు, పరిసరాలను శుభ్రం చేయకపోవడంతో రోడ్డుపై నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించడం లేదని, బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదని తెలిపారు. గ్రామంలో సర్పంచి ఉన్నారో లేరో కూడా తెలియడం లేదన్నారు. అధికారులు స్పందించి గ్రామంలో డ్రెయినేజీ, చెత్తను తొలగించాలని కోరారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సిపిఎం గ్రామ నాయకులు కృష్ణ, రామాంజనేయులు, నాగేష్, లక్ష్మన్న, రాజు, హనుమంతు, శంకర్ పాల్గొన్నారు.

'పత్తిలో లద్దె పురుగుపై ఆందోళన వద్దు'

ప్రజాశక్తి - మంత్రాలయం

పత్తి పంటలో లద్దె పురుగు వస్తే రైతులు ఆందోళన చెందవద్దని ఎడిఎ మహ్మద్ ఖాద్రీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చిలకలడోణ, మాలపల్లి గ్రామాల్లో పత్తి పంటను ఎఒ జీరా గణేష్, ఎఇఒ తిరుమల రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పత్తి పంటలో అక్కడక్కడ లద్దె పురుగు కనిపించిందని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. లద్దె పురుగులు పత్తి పొలంలో ఉండే నాన్ బీటీ మొక్కలను ఆశించి, బీటీ మొక్కలను ఆశించవని చెప్పారు. రైతులు అనవసరంగా మందులు పిచికారి చేయవద్దన్నారు. మెగ్నీషియం లోప నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.

గోనెగండ్లలో కుక్కల పట్టివేత

ప్రజాశక్తి - గోనెగండ్ల



గోనెగండ్ల మేజర్ పంచాయతీలో రెండు రోజులుగా పంచాయతీ ఆధ్వర్యంలో కుక్కల పట్టివేత చేపట్టినట్లు సర్పంచి హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ తెలిపారు. మంళవారం గ్రామంలోని ప్రధాన వీధుల్లో రోడ్లపై వీధి కుక్కల సంచారం అధికమైందని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. సుమారు 300 కుక్కలను పట్టాలని తీర్మానించినట్లు తెలి పారు. ఇప్పటిదాకా 240 కుక్కలను పట్టినట్లు వివరించారు.

ఆర్‌ఎస్‌కెల ద్వారా యూరియాను అందిస్తాం

- తహశీల్దార్ రజనీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా అందిస్తామని తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఎఒ శేషాద్రి, బదినేహాల్ సహకార సంఘం అధ్యక్షులు మారెప్ప పేర్కొన్నారు. మంగళవారం ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆదోనికి 2 వేల టన్నులు యూరియా వచ్చిందని తెలిపారు. నానో యూరియాపై అవగాహన కలిగి పొలాలకు వినియోగించాలని రైతులను కోరారు. సహకార సంఘం సభ్యులు నబి సాబ్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ADONI MUNICIPALITY
e-Procurement Tender Notice

Roc.No.26/2025-26-E1 Dated: 09-09-2025.

Invites Tender Notice under General Funds

Down loading Start date and Time : 10-09-2025 @ 10.00 AM
Down loading End date and Time : 18-09-2025 @ 3.00 PM

For further details the tenderer may visit e-procurement platform on **www.tender.apeprocurement.gov.in.** or Cell No.98499 05859

Commissioner
Adoni Municipality.

ఫ్లోరోసిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి గోకులపాడు గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటి ఆరోగ్యంపై ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్, సుధాకర్ అవగాహన కల్పించినారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నోటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నోటి ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే పలు అనారోగ్య సమస్యలు తలెత్తుత్తాయని తెలిపారు. చిన్నతనం నుంచే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నోటి పరిశుభ్రత గురించి తెలుసుకోవాలన్నారు. లేకుంటే దంత, గుండె వ్యాధులతోపాటు మతిమరుపు కూడా వచ్చే ప్రమాదముందని తెలిపారు. నోటి పరిశుభ్రత .లేక పోవడం వలన వివిధ వ్యాధులకు గురవుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ నోటి పరిశుభ్రత పాటించాలని తెలిపారు. శరీరంలో రోగాల వ్యాప్తికి నోరు ప్రధాన కరణమవుతుందన్నారు. నోరు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాలు బారిన పడకుండా ఉండొచ్చునని అన్నారు. నోటి దుర్వాసన పళ్ళు పుచ్చిపోవడం తదితర, వాటివల్ల పలు రోగాల బారిన పడదం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పళ్ళను శుభ్రంగా ఉంచుకొని రోగాల బారిన పడకుండా చూసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ నోటి శుభ్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ప్రతిరోజూ రెండు పర్యాయాలు శుభ్రపరచుకుంటే యెలాంటి రోగాలు రావని తెలిపారు. పొగాకు ఏ రూపంలో వినియోగిస్తున్న ఆరోగ్యానికి హానికరమేనని తెలిపారు. బీడీ, చుట్ట, రాజ ఖైని, గుట్కా జర్దా, నశ్యామ్ అన్నీ హానికరమేనని తెలిపారు. ఈ విషయాలను మీకుటుంబ సభ్యులకు తెలపాలని విద్యార్థులకు తెలిపారు. హెడ్ మాస్టర్ హనుమంతు, ఉపాధ్యాయులు సుబ్బయ్య, చాముండేశ్వరి, సామాజిక ఆరోగ్య అధికారి చందన,ఆశా కార్యకర్త ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు



నాగలాపురంలో: నాగులాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్ విద్యార్థులకు ఫ్లోరోసిస్ పై అవగాహనా కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్లోరోసిస్ అనే వ్యాధి దంతాల మీద అడ్డంగా పసుపు రంగు గీతాలు యేర్పడుతాయని, దంతాలు గోధుమ రంగులో ఉండడం, చిగుళ్ల మధ్య నల్లగా ఉండడం, చాక్ పీసు రంగులోకి మారి, దంతాలు గుంటలుగుంటలుగా యేర్పడి దంతాలు పిప్పి పళ్లగా తయారవుతాయని తెలిపారు. మనం తినే ఆహారం సరిగా నమలలేక పోతారని, దీని వలన తల నొప్పి రావడం, దంతాలకు రంధ్రాలు పడడం వలన సరైన పోషకాహారం తీసుకొనలేరు, దీనివలన పోషకాహారలేమికి , అనేక వ్యాధులకు గురి అవుతారని తెలిపారు. దంత సమస్యలవలన ఇతరులతో కలవకపోవడం, మాట్లాడలేక పోవడలాంటి సమస్యలు ఏర్పడుతాయని తెలిపారు. హెడ్ మాస్టర్ ఇమామ్ హుస్సేన్, సామాజిక ఆరోగ్య అధికారి ఉమామహేశ్వారి, ఆరోగ్య కార్యకర్తల కృష్ణవేనమ్మ, ఆశా కార్యకర్త ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

హంద్రీలో ముళ్ల చెట్లు తొలగించాలి

ఇ రామాంజనేయులు,కెవిపిఎస్ 32వ వార్డ్ అధ్యక్షులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ పరిధి, 32వ వార్డ్, ప్రాంతం హంద్రీ నదిలో పెరిగిన ముళ్ల చెట్లను తొలగించాలని కెవిపిఎస్ 32వ వార్డ్ అధ్యక్షులు ఇ.రామాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో హంద్రీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హంద్రీ నదిలో పూర్తి స్థాయిలో ముళ్ల చెట్లు పెరిగి అసాంఘీక కార్యక్రమాలకు నెలవుగా మారిందన్నారు. మరోవైపు స్థానిక ప్రజల ఇళ్లల్లోకి పాములు, తేళ్లు వంటి విషపురుగులు సంచరిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో విషపురుగులు కుట్టడం వల్ల అనారోగ్యాలకు గురవుతూ ఇబ్బందులు పడుతన్నట్లు చెప్పారు. పలుమార్లు సచివాలయం, నగర పాలక సంస్థ అధికారులకు వినతులు అందచేసిన పట్టించుకోని దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ కమిషనర్ స్పందించి, తక్షణమే హంద్రీ నదిలో పెరిగిన ముళ్ల చెట్లు తొలగించి, ప్రజల



ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి నగర పాలక సంస్థ వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని తెలిపారు. కెవిపిఎస్ 32వ వార్డ్ కార్యదర్శి సురేష్, నాయకులు వెంకటేష్, చిట్టిబాబు, రాజు, వెంకట్, సూరి పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజన' కార్మికులకు పెండింగ్ బిల్లులివ్వాలి

ప్రజాశక్తి-పత్తికొండ

మధ్యాహ్నం భోజన పథకం కార్మికులకు రావల్సి పెండింగు బిల్లులు వెంటనే చెల్లించాలని ఎపి ఫుడ్ కమిషనర్ గంజామాల దేవిని సిఐటియు మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర కోరారు. పత్తికొండ పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన గంజామాల దేవిని మంగళవారం కస్తూర్బా పాఠశాల ఆవరణలో రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం ఎంతోభృహత్తరమైందని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని దానిలో భాగంగానే మధ్యాహ్న భోజన కార్మికులు కూడా అహర్నిశలు కష్టపడి పిల్లలకు మంచి భోజనాన్ని వండుతున్నారన్నారు. అలాంటి మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలల నుండి వారి బిల్లులు సరిగా వేయకపోవడంతో ఎన్నోసార్లు అప్పుల పాలై మధ్యాహ్న భోజన పథకాన్ని నెట్టుకొస్తున్నారన్నారు.



గజమాల దేవికి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వివరిస్తున్న సిఐటియు రవిచంద్ర

జగదేక సుందరి సామకు జాతీయస్థాయి లో ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్



సత్య సాయి సేవా సమితి ఎపి రెవెన్యూ సర్వీసెస్ అమరావతి జెఎసి ఆధ్వర్యంలో ఈనెల 5నుంచి 8 వరకు అనంతపురం శ్రీకృష్ణ కళామందిరంలో జాతీయస్థాయి పద్య నాటక పోటీలు జరిగాయి. ఇందులో కర్నూలు టిజివి కళాక్షేత్రం వారు ప్రదర్శించిన "జగదేక సుందరి సామ" పద్య నాటక పోటీల్లో ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ నాటక రచన కీర్తిశేషులు లక్ష్మి కులశేఖర్ కాగా పద్య రచన దర్శకత్వం పత్తి ఓబులయ్య వహించారు. దీంతోపాటు నాలుగు వ్యక్తిగత బహుమతులను సాధించారు. ఉత్తమ దర్శకత్వం పత్తి ఓబులయ్య, ఉత్తమ పాత్ర కె.బాల వెంకటేశ్వర్లు, ఉత్తమనటి సురభి ప్రభావతి, ఉత్తమ నటుడు జీవి శ్రీనివాసరెడ్డి సాధించారు. వారికి బహుమతులను జిల్లా రెవిన్యూ అధికారి మలోల సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు మైఖేల్ బాబు, సీనియర్ రంగస్థలం నటుడు బాలాజీ నాయుడు సుబ్రహ్మణ్యం అందజేశారు. ఇందులో జివి శ్రీనివాస్‌రెడ్డి, సంఘ ఆంజనేయులు, ఎస్ మహమ్మద్ మియా తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలలో రిడ్జ్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్



విద్యార్థిని అభినందిస్తున్న సిఇఓ గోపినాథ్

రిడ్జ్ పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న తోటిరెడ్డి కీర్తి సిబిఎస్ఇ జాతీయ స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీలలో కాంస్యపథకం సాధించి ప్రతిభ కనబరిచింది.. ఈనెల 3 నుండి 7 వరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని అమ్నీవ్ విజన్ పాఠశాలలో నిర్వహించిన ఈపోటీలలో తలపడి రిడ్జ్ పాఠశాల విద్యార్థి కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పాఠశాల సిఇఒ గోపీనాథ్ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందించారు. పాఠశాల కో సిఇఒ సౌమ్యా గోపినాథ్, డీన్ రాజేంద్రన్ ప్రిన్సిపల్ రాజ్ కమల్ , ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ విసి చంద్రశేఖర్, ముఖ్యఅతిథి డాక్టర్ ఒపి యాదవ్

స్నాతకోత్సవంలో కెఎంసి విద్యార్థులకు మెడల్స్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 27, 28వ స్నాతకోత్సవం మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో జరిగింది. ఈ స్నాతకోత్సవంలో కర్నూలు మెడికల్ కాలేజీలో చదివిన ముగ్గురు విద్యార్థులకు మెడల్స్ లభించాయి. 27వ స్నాతకోత్సవంలో పెరిగెల నమ్రత, తలారి అనూషకు 28వ స్నాతకోత్సవంలో చెరుకూరి సాయితరుణ్‌కు మెడల్స్ లభించాయి. వారికి డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్, ఢిల్లీలోని నేషనల్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అండ్ చీఫ్ కార్డియక్ సర్జన్ డాక్టర్ ఒపి యాదవ్ చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారు. ఎంబిబిఎస్ ఫైనల్ ఇయర్ (2023) రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ ఔట్ గోయింగ్ విద్యార్థిగా మెడల్ సంపాదించిన డాక్టర్ పి.నమ్రత కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ జనరల్ సర్జరీ హెచ్ఒడి డాక్టర్ పి. హరిచరణ్, ఆప్తమాలజీ ప్రొఫెసర్ డాక్టర్ నివేదితల కుమార్తె ఆమె 2018లో కర్నూలు మెడికల్ కాలేజీలో చేరారు. 2023లో ఎంబిబిఎస్ పూర్తి చేసుకొన్ని ప్రస్తుతం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో ఎండి పీడియాట్రిక్స్ రెండో సంవత్సరం చదువుతున్నారు. మెడల్స్ అందుకున్న విద్యార్థులను కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ అభినందించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కత్తినరసింహారెడ్డి

కారుణ్య నియమకాలు త్వరగా చేపట్టాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పాఠశాల విద్యాశాఖలో విధి నిర్వహణలో మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రంజిత్ భాషను ఎస్‌టియు జిల్లా ప్రతినిధి బృందం కలిసి పలు సమస్యలను విన్నవించారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డితో పాటు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోకారి, జనార్ధన్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజామ్ భేగ్, రాష్ట్ర నాయకులు నాగేశ్వరరావు ధనుంజయ నాయుడు ఉన్నారు. ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న సమస్యలన్నీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. పశ్చిమ ప్రాంతంలోని కెజిబివి మోడల్ , గురుకుల పాఠశాలలో సీట్ల సంఖ్య పెంచాలని విన్నవించారు.

రాయలసీమ వర్సిటీలో పరేడ్ ఎంపికలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వెస్ట్ జోన్ ప్రీరిపబ్లిక్ డేపెరేడ్ ఎంపికల్లో రాయలసీమ యూనివర్సిటీ లో మంగళవారం వర్సిటీ ప్లేగ్రౌండ్‌లో ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ ఎంపికలు నిర్వహించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెక్టర్ ఎన్‌టికె నాయక్ రిజిస్ట్రార్ బి .విజయకుమార్ కుమార్ నాయుడు ప్రారంభించారు. వర్సిటీ విద్యార్థులు పరేడ్‌కు ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు. ఆంధ్ర తెలంగాణ ప్రాంతాల రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రామకృష్ణ విద్యార్థులకు దిశానిర్దేశంచేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు బివి. శివప్రసాదరెడ్డి, డాక్టర్ ఎస్.నాగచంద్రుడు, డాక్టర్ కె.వెంకటరత్నం, డాక్టర్ బి.విజయుడు, యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శివకిషోర్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు లోపించకుండా చూడాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పార్శిద పనులు లోపించకుండా చూడాలని ఎంపిడిఒ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఓర్వకల్ మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో ఎంపిడిఒ శ్రీనివాసులు విస్తృత పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనుల నిర్వహణపై పంచాయతీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కల్లూరు వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. మంగళవారం జిల్లా కలెక్టరును ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి కలిసి పలు సమస్యలను విన్నవించారు. కల్లూరువార్డులో రోజువారీగా తాగునీటిని సరఫరా చేసేలా చూడాలన్నారు. ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.